



# నూతి బైట కప్పలు

రెండున్నరయింది.

జుట్టులోంచి క్రిందికి జారిన చెమట "ఏంజిల్‌ఫేస్"లో అద్దిన చెక్కిలి పాడుచెయ్యకుండా కర్చీఫ్‌తో అద్దుకొంటూ, "ఇట్స్ రియల్లీ హాట్ యార్" అంది సుమిత్ర.

ప్రేమ అవునన్నట్టు తలూపి, చుట్టూ పరికించి చూసింది.

బాల్కనీ బుకింగు దగ్గర క్యూ చాంతాడులా వుంది. అయిదు బెల్‌బాటమ్స్, ఒక

గొట్టం. మళ్ళీ రెండు బెల్ బాటమ్స్, ఓ పైజామా... ఇలా సాగిపోయింది.

దానికి పక్కనే ఆడవాళ్ళ గుంపుంది. భారతదేశంలో స్త్రీ యింకా అబలే అన్న విషయాన్ని బలపరుస్తున్నట్టుగా ఆ గుంపు మొగవాళ్ళతో పోలిస్తే తక్కువగా వుంది.

"టిక్కెట్లు దొరుకుతా యంటావా?" అడిగింది సుమిత్ర.

"అటో టిక్కెట్టూ, ఇటో టిక్కెట్టూ యిస్తారుగా- దొరకొచ్చు" అంది ప్రేమ.

హాలు కాంపౌండ్‌లోకి జనం చీమల్లా వస్తున్నారు. సోడావాడు ఎడతెరిపి లేకుండా కొడ్తూనే వున్నాడు. క్రింద తరగతి బుకింగ్ దగ్గర ఏదో గొడవ జరుగుతోంది.

హాలు ముందంతా రంగు రంగుల కాగితాలు అంటించేరు. పైన చిన్న చిన్న బల్బులు అమర్చేరు "హౌస్‌ఫుల్" బోర్డు వెనక్కి తిప్పిపెట్టి వుంచేరు, తప్పకుండా దాని అవసరం పడుతుందని తెలిసినట్టు. నిలువెత్తు బ్రూస్‌లీ బొమ్మ హుందాగా వుంది.

ప్రేమ అటూ ఇటూ చూస్తోంది.

మెయిన్ గేటు కవతల రోడ్డుంది. రోడ్డుకి అవతలివైపు కిళ్ళీ కొట్టు వుంది. దాని ముందు రెండు చిన్న బల్లలువున్నాయి.

కిళ్ళీకొట్టు బల్లమీద కూర్చుని కొట్టువాడితో సరసాలాడుతోంది ఓ పిల్ల. వాడు కసిరికొడుతున్నా కదలకుండా అక్కడే నిలబడి నవ్వుతోంది. వాడుకూడా అంత బలంగా కసిరికొట్టడం లేదు, నవ్వుతూనే వున్నాడు. అది అరటిపళ్ళ గెలమీద చెయ్యివేసినప్పుడల్లా లాగిపారేస్తున్నాడు.

"వాళ్ళ నేమంటారో తెలుసా?"

ఏమంటా రన్నట్టు చూసింది సుమిత్ర.

"రోడ్‌సైడ్ బిచెస్."

ఇంకోసారి అటు చూసి, కళ్ళు తిప్పుకుంటూ "టైమెంతయింది?" అని అడిగింది.

"పావుతక్కువ మూడు".

"అనాటమీ ప్రొఫెసరొచ్చుంటాడు."

"మనిద్దరం లేకపోవటంతోఅనుమానం వచ్చే వుంటుంది-"

"అంతమందిలో తెలుస్తుందా పాడా-"

"రాగానే వాడి కళ్ళు మనకోసమే వెతుకుతాయి."

సుమిత్ర మొహం చిట్లించి "పోనిద్దూ, గ్రద్ద ముక్కు మొహమూ, వాడూనూ" అంది.

"ఈ ఒక్క సంవత్సరమూ మెలానోఒకలా గట్టెక్కేస్తే..." అంది ప్రేమ.

"ఈ ఇయరే కష్టం."

"అందమయిన అమ్మాయిలకి ప్రతి సంవత్సరమూ కష్టమే-"

"ఏం-"

"అంత తొందరగా వదిలిపెట్టటానికి ప్రొఫెసర్లు ఒప్పుకోవద్దూ-" నవ్వింది.

"అటు చూడు" అంది ప్రేమ అకస్మాత్తుగా.

సుమిత్ర చప్పున అటు చూసింది.

కిళ్ళీకొట్టు దగ్గరికి ఓ రిక్షావాడు చేరేడు. ఆ పిల్ల వాడితో యేదో మాట్లాడుతోంది. అరిటి గెల చూపిస్తోంది. కిళ్ళీకొట్టువాడు నవ్వుతున్నాడు. రిక్షావాడు యేదో అంటున్నాడు. కొట్టువాడు వంగేలోపులోనే అది గెలనుంచి ఓ ఆరు, యేడు పళ్ళు తీసుకొని పక్క పాకలోకి పరుగెత్తింది. రిక్షావాడు జేబులోంచి డబ్బుతీసి కొట్టువాడికిచ్చి పాకవైపు నడిచేడు.

"ఇప్పుడర్థమైందా- వాళ్ళని రోడ్‌సైడ్ బిచ్‌లని ఎందుకన్నారో-" అంది ప్రేమ.

ఏదో వింత చూస్తున్నట్టు నిలబడిపోయిన సుమిత్ర బిగపట్టిన వూపిరి వదుల్తూ, "మైగాడ్-" అంది నమ్మలేనట్టు.

"ఏం- ఇటువంటి విషయాలు కథల్లో ఎప్పుడూ చదవలేదా?" అంది ప్రేమ.

"మరీ యింత పబ్లిగ్గానా..."

స్నేహితురాలికి విషయమూ-సబ్జెక్టూ అసలు తెలీదని తెలియగానే ఇంట్రస్టు పెరిగింది. "ఇంకా చీప్‌గా వుంటార్ట. అరగ్లాసు టీకోసం-" అని యేదో చెప్పబోతూ వుంటే, "ప్లీజ్... డోన్టాక్ ఎబైట్ దోజ్ రాటెన్ థింగ్స్ ఐ సే-" అంది వారిస్తున్నట్టు.

ఇంతలో ఒక రెండేళ్ళ కుర్రవాడు, వంటి మీద బట్టల్లేనివాడు- అస్థిపంజరంలా వున్నవాడు, తల్లి లోపలికి వెళ్ళటం చూసి, గుడిసె దగ్గరకు పరిగెత్తుకుంటూ వెళ్ళి, మూసి వున్న తలుపుల్ని బాదసాగేడు. వాడి వళ్ళు తారులా నల్లగా వుంది. వాడిపొట్ట, తినటమే ధ్యేయంగా పెట్టుకున్న శేట్‌జీ పొట్టలాగా బాగా వుబ్బి వుంది- ఆకల్తో రోగనిరోధకం తగ్గిపోయి కాలేయం పెరగటంవల్ల!

వాణ్ణి చూసి, కిళ్ళీకొట్టువాడునవ్వుతూ ఏదో అరుస్తున్నాడు. వాడు వినకుండా తలుపులు బాదుతూనే వున్నాడు.

"వాడు దాని కొడుకు. చూసేవా సెంటిమెంటు ఎలా 'ప్లే' చేస్తుందో" అంది సుమిత్ర.

'...ఆకలే ముఖ్యం కాదు మనిషికి...'

తాము అటు చూడటం ఎవరూ చూడటంలేదని నిశ్చయించుకొని, అటు చూస్తోంది ప్రేమ.

ఇంతలో తలుపు కొద్దిగా తెరుచుకొని ఓ చెయ్యి బైటకొచ్చింది. రెండు అరటిపళ్ళని వాడి కందించి, ఎంత స్పీడుగా వచ్చిందో, అంత స్పీడుగా వెళ్ళిపోయింది. తలుపులు మూసుకున్నాయి.

నోటమాట రానట్టు నిలబడిపోయేరిద్దరూ.

కిళ్ళీకొట్టు చెక్కకి ఆనుకుని, నేలమీద కూర్చుని తింటున్నాడు వాడు.

ప్రేమ ముందు తేరుకుంది. "చూసేవా? ఆకలి మనిషిని ఎంతకయినా దిగజారుస్తుంది' ' అంది ఈసారి.

"నేనొప్పుకోను" అంది సుమిత్ర అటువైపు నుంచి కళ్ళు తిప్పుకుంటూ.

ఎవరి గొడవలో వాళ్ళున్నారు. అంతా రణగొణ ధ్వనిగా వుంది. అందరి మొహాల్లోనూ

విసుగు కనిపిస్తోంది. సోడాలవాడు కొడ్తూనే వున్నాడు. పల్లీలవాడు గొంతు చించుకుని అరుస్తున్నాడు. అడుక్కుతినే వాళ్ళని అడుక్కు తినేవాడిలా వున్న దౌర్భాగ్యుడు ఒకొక్కళ్ళ దగ్గరా నిలబడి ముట్టుకుని మరీ డబ్బులు అడుక్కుంటున్నాడు.

"ఆ అరటిపళ్ళకోసం ఆడది శీలాన్ని అర్పితం చేసుకుంటోందంటే- ఇట్స్ ఆఫుల్."

ప్రేమకీ ఈ దృశ్యాన్ని ఇలా మొదటిసారి చూడటం వల్ల కొత్తగానే వుంది. కానీ స్నేహితురాలు అలా మాట్లాడింది కాబట్టి, సంభాషణ పొడిగించటానికి "నే చెప్పేనుగా- ఆకలని..." అంది, ఆ విషయం మీద సర్వం తెలిసినట్టు.

"ఎంత ఆకలయితే మాత్రం... ఇంత పబ్లిగ్గా- మిట్ట మధ్యాహ్నప్పూట..." అంది సుమిత్ర. "కనీసం రాత్రి వరకూ ఆగొచ్చుగా, ఎండలో ఆ రిక్షావాడి చెమటా అదీ... ఉఫ్... హారిబుల్ ఊహించుకుంటేనే కడుపులో తిప్పుతోంది"

"ఇలాంటి వాళ్ళమూలానే ఆడదంటే "చీప్" అనే అభిప్రాయం మొగవాళ్ళకి కలుగుతోంది."

"పోన్లేద్దూ వెధవ టాపిక్..." అంది సుమిత్ర. జనం యింకా ప్రవాహంలా వస్తూనే వున్నారు. సైకిళ్ళు పక్కగా పెట్టి క్యూ లో చేరిపోతున్నారు.

"టిక్కెట్టు దొరుకుతుందంటావా?"

"అనుమానవేఁ" అంది ప్రేమ చుట్టూ చూస్తూ.

ఇంతలో బుకింగ్ తెరిచారు. అంతవరకూ క్యూలో వున్న జనం ఒక్కసారిగా చెదిరి బుకింగ్ కిటికీని చుట్టుముట్టారు. క్రమశిక్షణ బెదిరి పారిపోయింది. ఆ తొక్కిడికి బలహీనులు బయట కొచ్చేశారు.

ఆడవాళ్ళందరూ దూరంగా ఓ గుంపుగా నిలబడ్డారు. బుకింగ్ వాడు టిక్కెట్లు చకచకా ఇస్తున్నాడు. గుంపులోంచి ఒకరొకరే బైటికి వస్తున్నారు. క్యూ దాదాపు చెదిరిపోయింది. గుంపు లోపలికి దూరలేని వాళ్ళు బయట నిలబడి టిక్కెట్టు తీసుకొని వస్తున్నవాళ్ళని కసిగా చూస్తున్నారు. చూస్తుండగానే సగం టిక్కెట్లయిపోయాయి.

"పోదావాఁ" అంది సుమిత్ర అటే చూస్తూ.

ప్రేమ మాట్లాడలేదు. బుకింగు నుంచి బయట కొచ్చిన వాళ్ళు ఆడవాళ్ళని చూసుకుంటూ హాల్లోకి వెళ్తున్నారు.

క్రింది తరగతి టిక్కెట్లు అయిపోయినట్టున్నాయి. వాళ్ళూ వచ్చి, గుంపులోకి దూసుకుపోతున్నారు. ఆడవాళ్ళలోంచి కొందరు అప్పుడే వెళ్ళిపోవటానికి సన్నద్ధులవుతున్నారు.

"అరగంట క్రిమినల్ వేస్ట్" అంది సుమిత్ర. "అదీ ఎండలో-"

"వేస్టేనంటావా?" స్నేహితురాలి వైపు చూడకుండానే అంది ప్రేమ.

"ఇంకా నీకుహోప్సున్నాయా?"

అతడి చేతిలో టిక్కెట్టూ, పెదవుల మీద విజయ గర్వంతో కూడిన నవ్వూ వున్నాయి. వంటి రంగుకీ, జుట్టు రంగుకీ పెద్ద తేడా లేకపోవటంతో, చెమట నుదుటి మీద పట్టిందో

జుట్టులోంచి కారిందో తెలియటంలేదు. వెనుక జేబులోంచి దువ్వెన తీసి దువ్వుకొని, లోపలికి వెళ్ళబోతూ, అతడు యదాలాపంగా తమవైపు చూసేసరికి, ప్రేమ పెదవులు విడీ విడనట్టు నవ్వి 'ప్లీజ్' అన్నట్టు చూసింది అర్థిస్తున్నట్టు.

అతను ఆగి, తననేనా అన్నట్టు చూసేడు క్షణంపాటు. ఆక్షణంలోనే పదిరూపాయల నోటు అందిస్తూ, "ఇఫ్ యూ డోంట్ మైండ్" అంది తియ్యగా.

"ఓ- ష్యూర్" అంటూ హుషారుగా ఆమె చేతిలోంచి నోటు అందుకుని మళ్ళీ గుంపులోకి జొరబడ్డాడు అతడు. ఐదు నిమిషాల్లో అతను జనాన్ని తోసుకుంటూ బయటకొచ్చేడు. ప్రపంచాన్ని గెలిచినట్టూ వున్నాడు. బనీన్ భుజం దగ్గిర కొద్దిగి చినిగినట్టుంది. అప్పుడే దువ్విన క్రాపు మళ్ళీ చెదిరిపోయింది. వీటిని దేన్నీ లక్ష్యపెట్టకుండా దగ్గరకొచ్చి, టిక్కెట్లు అందించేడు.

"చాలా థ్యాంక్సండీ" తియ్యగా అంది ప్రేమ.

"నో మెన్షన్ ప్లీజ్" చూపుడు వేలితో జుట్టు పైకి తోసుకున్నాడు.

ఇద్దరూ హాలులోకి నడిచారు.

"నిజంగా నీ ధైర్యానికి మెచ్చుకోవాలి" అంది సుమిత్ర.

"ఆ... మెడికల్ కాలేజీలో చదువుతూ ఆ మాత్రం ధైర్యం లేకపోతే ఎలా... అవసరం మనది."

"దొరక్కపోతే మాత్రం చాలా డిజప్పాయింట్ అయివుండేవాళ్ళం."

ఇద్దరూ కారిడార్‌లోకి వెళ్ళేరు. అతడు టిక్కెట్టు అందిస్తూ కావాలని చెయ్యి తగిలించగా అంటిన చెమటని 'యార్డ్లీ' పౌడర్ అద్దిన చేతి రుమాల్తో సుతారంగా తుడుచుకుంటూ, "ఇట్సరియల్లీ హాట్ యార్" అంది ప్రేమ.

"వియ్ విల్ హ్యావ్ కోకో కోలా బాస్"

ఆ తరువాత ఇద్దరూ ఆ కారిడార్ చివరే వున్న డ్రింక్స్ టేబుల్ దగ్గరికి నడిచేరు.

నూతిబైటి కప్ప కూపస్థ మండూకాన్ని చూసి జాలిపడుతుంది. కానీ నీళ్ళు ఎక్కడయినా ఒకటే! ఆరు అరటి పళ్ళకోసం అంటిన చెమటకన్నా రెండు టిక్కెట్లకోసం అంటిన చెమట ఏ విధంగా మిన్న?

❁ ❁ ❁

**(ఆంధ్రజ్యోతి - 1972)**